క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగులు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌ను తన కార్యాలయంలో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగులందరు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోండి

ఐబీఎం సంస్థ ప్రతినిధి అశ్విని కుమార్



తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని ఐబీఎం సంస్థ ప్రతినిధి అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో బుధవారం స్కిల్ డెవలప్ మెంట్‌పై వర్క్ షాపును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ శాంత కుమారి, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు ప్రసన్న కుమార్, మణికంఠ గోపాల్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఏర్పరచుకోవాలి



తెనాలిఅర్బన్: హెచ్‌ఐవీపై ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని మార్తా నర్సింగ్ కళాశాల ఏవో సి.హెచ్.కమలాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు హ్యాపెన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవీపై పట్టణంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని పేర్కొన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నళిని ప్రియదర్శిని,కె విజయలక్ష్మి, కె నాగేంద్రం పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



తెనాలి రూరల్: మండల పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బుధవారం బహుకరించారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తలతోటి సుభాషిణి తన భర్త జోసెఫ్ జ్ఞాపకార్థం 25 మంది క్రీడాకారులైన విద్యార్థులకు దుస్తులు బహుకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్.అనురాధ తెలిపారు. కార్యక్రమంలో టి.నోయల్, ప్రత్యక్ష పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయుడమ్మ జీవితం శాస్త్రవేత్తలకు స్ఫూర్తి



తెనాలి: ప్రఖ్యాత శాస్త్రవేత్త, శాస్త్రవిజ్ఞానం గ్రామీణ ప్రజానీకానికి అందించాలని కృషిచేసిన డాక్టర్ యలవర్తి నాయుడమ్మ జీవితం తమలాంటి ఎందరికో స్ఫూర్తిగా చెన్నైలోని కేంద్ర చర్మ పరిశోధనా సంస్థ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణ వి.కాంత్ అన్నారు. డాక్టర్ నాయుడమ్మ జయంతి రోజైన బుధవారం స్థానిక మార్కెట్ యార్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథ బాబు, వైస్ చైర్మన్ కొత్త సుబ్రమణ్యం, కటారి వాసుదేవ నాయుడు, కడియాల నందకిషోర్, అరవింద ఘోష్,కె.అరవింద్, అయినాల మల్లేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొని నాయుడమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. భవిష్యత్ తరాలకు నాయుడమ్మ స్ఫూర్తిని అందించడం కర్తవ్యంగా భావించి, గతంలో పి.విష్ణుమూర్తి నిర్వహించిన అవార్డుల కార్యక్రమాన్ని తిరిగి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్టు యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు.

రూ.1.30 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో



యూరియా పై వ్యవసాయ అధికారిని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఫణి కుమార్

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలిటౌన్: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.30 కోట్ల విలువైన పనులకు బుధవారం సాయంత్రం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశానికి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. అజెండాలోని అన్ని అభివృద్ధి అంశాలనూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కొలకలూరు లో నిర్మాణం చేస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ల అంశంపై ఎంపీటీసీ కాలిశెటిట ఫణికుమార్ అధికారులను ప్రశ్నించారు. డ్రెయిన్ల నిర్మాణం ఏ సర్వే ప్రకారం చేస్తున్నారని? సాయిల్ టెస్టింగ్ సర్వే రిపోర్ట్ ఉందా? అని అధికారులను ప్రశ్నించారు. సమగ్రమైన రిపోర్టు లేకుండా ప్రజాధనం వృధా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. డ్రెయిన్ల నిర్మాణంపై గ్రామంలోని ఎంపీటీసీలకు కనీస సమాచారం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారుల వైఖరిని తప్పుపట్టారు. అజెండాలోని అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులకు మాత్రమే సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల నుంచి యూరియా అమ్మకాలు చేయాలని నిబంధన అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికీ 2,500 మెట్రిక్ టన్నుల యూరియా తెనాలి మండలంలోని రైతులకు ఇచ్చినట్టు చెప్పారు. రైతులకు 2,400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరత మాత్రమే ఉందని తెలిపారు. యూరియా స్టాక్ పెట్టడం వల్ల గడ్డకట్టి పాడవుతుందని వెల్లడించారు. రైతులు అవసరానికి తగినట్టుగా మాత్రమే పొలానికి వాడాలని సూచించారు. యూరియాను నిజమైన రైతులకు ఇవ్వకుండా అక్రమ మార్గాన టీడీపీ నేతలు కొన్ని సొసైటీలలో కూర్చొని తీసుకెళ్లడాన్ని పలువురు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు తప్పుపట్టారు. టన్నులకొద్దీ యూరియా అక్రమ మార్గాన తరలి వెళుతుందని ఆరోపించారు. ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.70 లక్షల నిధులతో కాల్వల మరమ్మతులు ఆధునీకరణ పనులు చేసినట్టు తెలిపారు. మండలంలోని పలువురు ఎంపీటీసీలు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం, మెరుగుపరచాలని నూతన రోడ్లు డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సమావేశంలో కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కోడూరు స్వప్న, ఎంపీడీవో అత్తోట దీప్తి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనూష, మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, తేలప్రోలు సర్పంచ్ భాష, మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి



మాట్లాడుతున్న మాల్యాద్రి

తెనాలిఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావులు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని బుధవారం గాంధీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెలలో చత్తీస్‌గడ్‌లో జరిగే జాతీయ మహాసభలలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, తుంగ బాలస్వామి, పాశం వెంకటేష్, గండు శివ, బిళ్ల రాజేష్, గోపి, కోల శేఖర్, రవి, కోట్లు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం దేవస్థానానికి రూ.లక్ష వితరణ

తెనాలి: చిన్నతిరుపతిగా పేరొందిన తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంకు తెనాలికి చెందిన చందు సత్యనారాయణ వరప్రసాద్-శివపార్వతి దంపతులు బుధవారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వి.అనుపమకు ఈ మొత్తాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికరమేష్, పాల్గొన్నారు. దాతల సహకారంతో వీటి నిర్మాణం చేసినట్టు ప్రధాన అర్చకుడు రత్నాకరం సత్యనారాయణగౌతమ్ తెలిపారు. కుమార్ పంప్స్ కొత్త సుబ్రహ్మణ్యం రూ.22 లక్షలతో షెడ్డు మొత్తం వేయించారని, దాతల సహకారంతో మిగిలిన పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. చివరగా ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ కోసం రూ.1.65 లక్షల బకాయిలుంటే, ప్రియదర్శిని కాలేజి రూ.లక్ష ఇవ్వగా, మిగిలిన 65 వేలు, వివిధ సందర్భాల్లో తమ పేరిట అన్నదానం చేసేందుకని మరో రూ.35 వేలు కలిపి తెనాలికి చెందిన చందు సత్యనారాయణవరప్రసాద్ -శివపార్వతి దంపతులు మొత్తం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. పూర్తిచేసిన షెడ్డులో పొంగలిశాల, కేశఖండనశాలతో క్యాటరింగ్, టెంట్ హౌస్‌కు కూడా అవకాశం కల్పించామని, పిల్లలు, మహిళలకు స్నానం గదులు కూడా నిర్మించినట్టు వివరించారు. అతిత్వరలో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వైద్యపరికరాల వితరణ

తెనాలి: 'మానవత, తెనాలి' సంస్థ, తమ సామాజిక బాధ్యతలో భాగంగా తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఉపయోగపడే విధంగా బుధవారం పలు వైద్య పరికరాలను విరాళంగా అందజేసింది. ఒక వీల్‌చైర్, రెండు పేషెంట్ ఎగ్జామినేషన్ టేబుల్స్, ఒక స్ట్రెచర్ ఆరు సెలైన్ స్టాండ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మానవత తెనాలి రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, 'మానవత నిజంగా అవసరమున్న వారికి తోడుగా నిలబడే సంస్థ' అని చెప్పారు. మానవత చైర్మన్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ అవసరమైన వారికి సహాయం చేయడానికి తమ కమిటీ కృషి చేస్తోందని తెలిపారు. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ మానవత వితరణ రోగులకెంతో ఉపయోగకరంగా ఉంటుందంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానవత కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు కటకం వెంకట ప్రసాద్, సంయుక్త కార్యదరి డీవీ సోమయ్య శాస్త్రి, కార్యవర్గ సభ్యులు మొవ్వ సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు, మల్లాది అర్జున, కప్పూరి నాగేశ్వరరావు, ఎస్ ఎల్ వి అప్పారావు, పి.రాంమోహన్ రావు, పరుచూరి మల్లికార్జునరావు, మన్నె సత్యనారాయణ, సీహెచ్ సాంబశివరావు, శ్రీనివాసరావు, ఆర్.భుజంగరావు, పి.శివ రాజకుమారి పాల్గొన్నారు.



వైద్యపరికరాలను అందజేసిన మానవత బాధ్యులు

ప్రకృతి వ్యవసాయ రైతులకు మార్కెటింగ్ సదుపాయం

కొల్లిపర: మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించే పంటలను రైతుసాధికార సంస్థ, ఎ.ఎస్.ఆర్ నేచరల్స్ తరుపున అధిక ధరలతో ప్రీమియం ధర చెల్లించి మేలైన కూరగాయలు కొనుగోలు చేస్తామని ఎ.ఎస్.ఆర్ నేచరల్స్ అధికారి ఎ.సాంబిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో ఆరిమండ కల్యాణ మండపంలో పకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిస్తున్న రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు నాటిన రోజు నుండి కోత దశ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.సి సునీత, అదనపు డీపీఎం సత్యనారాయణ, జిల్లా పకృతి వ్యవసాయాధికారిణి రాజకుమారి, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆటో దొంగ

తెనాలిరూరల్: ఆటో చోరీ చేసిన యువుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ టూ టౌన్ సర్కిల్ పరిధిలో ఓ ఆటో ఇటీవల చోరీకి గురైంది. ఆటో యజమాని పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడింది ఒంగోలుకు చెందిన యువకుడు నాగరాజుగా పోలీసులు గుర్తించి బుధవారం అదుపులోకి తీసుకున్నారు.

కాల్వలు వ్యర్థాలు వేయవద్దు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు.



తెనాలిఅర్బన్: కాల్వల్లో వ్యర్థాలు వేయటం వల్ల పారుదల నిలచిపోతుందని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. 17వ వార్డులో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అనేక కాల్వల్లో ప్రతిరోజు వ్యర్థాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఇలా చేయటం వల్ల దోమల వ్యాప్తి కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఎవరు కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ దోమల వల్ల అనేక వ్యాదులు ప్రభలే అవకాశం ఉందన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కాల్వల్లో స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరి సెక్రెటరీ గుమ్మడి ప్రవీణ్ కుమార్, మేకా సురేంద్ర బాబు, కరిముల్లా, వేణుగోపాల్, శరత్ బాబు పాల్గొన్నారు.

రక్తకన్నీరు నాగభూషణం చిరస్మరణీయుడు

అమర కళాకారుల సంస్మరణలో లలితానంద ప్రసాద్



మాట్లాడుతున్న లలితానంద ప్రసాద్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా బుధవారం సాయంత్రం రక్తకన్నీరు నాగభూషణం సంస్మరణ సభను నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఏర్పాటైన సభకు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రచయిత లలితానంద ప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ రంగస్థల, సినీనటుడు నాగభూషణంకు ఆయన విస్తృతంగా ప్రదర్శించిన రక్తకన్నీరు నాటకమే ఇంటి పేరైందని చెప్పారు. జీవితాంతం ప్రజానాట్యమండలి బలోపేతానికి నిర్విరామ కృషి చేశారని చెప్పారు. ఆత్రేయ నాటకాలైన భయం, పరివర్తన, కప్పలు నాటకాలను ఆంధ్ర దేశమంతటా ప్రదర్శించినట్టు తెలిపారు. వెయ్యి సినిమాల్లో నటించారని చెప్పారు. మాన్యం బదరీనాథ్ మౌనిక, లక్కరాజు లక్ష్మణరావు, తుంగా బాలస్వామి మాట్లాడారు.

అండగా ఉంటూ.. బంగారం చోరీ

తెనాలిరూరల్: వృద్ధులకు అండగా ఉంటూ చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బుర్రిపాలెం రోడ్డు నాగయ్య వీధిలో శాఖమూరి గరికుమారి, ఆమె భర్త నివసిస్తున్నారు. పిల్లలు అమెరికాలో ఉండడంతో వీరి బాగోగులు చూసేందుకు ఓ వ్యక్తిని పనిలో పెట్టారు. ఈ నెల 8న పనిచేసే వ్యక్తి ఇంట్లో ఉన్న 80 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించుకెళ్లాడు. భర్త దివ్యాంగుడవడం, వృద్ధురాలైన గిరికుమారి వెంటనే పోలీసులను ఆశ్రయించలేదు. తెలిసిన వారి సాయంతో బుధవారం పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు రాత్రికి నమోదు చేశారు.

అవసరం ఉన్నంతవరకే ఎరువులు వాడాలి

జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ సునీత



మాట్లాడుతున్న సునీత

మున్నంగి(కొల్లిపర): వరి, ఇతర పంటల్లో రైతులు అవసరం ఉన్నంత వరకే ఎరువులను వాడాలని, అధికంగా ఎరువులు వాడటం వలన భూమికి నష్టం చేస్తుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రెనింగ్ కోఆర్డినేటర్ సునీత అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం , పకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో రైతులకు పకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనాల వాడకం వల్ల నేటి సమాజంలో కాన్సర్ రోగాలు చిన్న, పెద్ద అని తేడా లేకుండా ఎక్కువ మంది బారిన పడుతున్నారని, కావున రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వాడాలన్నారు. అలాగే పంట వ్యర్థాలను తగల పెట్టకూడదని వివరించారు. యూరియా, డీఏపీలకు ప్రత్యామ్నాయంగా ఘన, ద్రవ జీవామృతం వాడుకోవచ్చుని, ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అజోల, కాషాయలు వాడి వరి పంట పండించ వచ్చు అని వివరించారు. 30 రకాల నవ ధాన్య విత్తనాలు సాగు చేసుకుంటే ఎరువుల అవసరం లేకుండా భూమి కి వావాల్సిన పోషకాలను అందించవచ్చు అన్నారు. ప్రతి రైతు తను సాగు చేస్తున్న భూమిలో నుంచి కనీసం 30 సెంట్లు భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసి రసాయన ఎరువులు వాడకం ద్వారా పంటలు ఎలా పండుతున్నాయి, 30సెంట్లలో పంటలు ఏవిధంగా దిగుబడులు వస్తున్నాయి అన్న విషయాలను గ్రహించి రానున్న రోజులల్లో ప్రతి పంట పకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే విధంగా రైతులు ముందుకు రావాలని కోరారు. అనంతరం ద్రవ జీవామృతం తయారీ విధానం డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ, సర్పంచ్ వేమూరి దీనమ్మ, రైతులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత

పొన్నపల్లి సత్యన్నారాయణ



మాట్లాడుతున్న పొన్నపల్లి సత్యన్నారాయణ తదితరులు

చెరుకుపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుళ్ళపల్లి నూకాలమ్మ దేవస్థానం ఆవరణలో మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక నిధులతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో నిర్మించిన దేవాలయాల్లో అదే కులస్తులకు చెందిన వారికి అర్చకులుగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ ద్వారా శిక్షణ ఇప్పించటం జరిగిందని, వారే దేవాలయాల్లో అర్చకత్వం నిర్వహించి ధూప దీప నైవేద్యాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ అర్చకులు ఈ నెల 20వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారని, అందుకు గాను సన్నద్ధ సమావేశం నిర్వహించామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ఎస్ఎస్ఎఫ్ నెరవేరుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, చింతల మురళీకృష్ణ, జిల్లా దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

వరి దుబ్బు దశలో తగు యూరియా అందించాలి

ఏవో ఎండీ ఫారూఖ్



తుమ్మలపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో షారూఖ్

చెరుకుపల్లి: వరి పంట దుబ్బు దశలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ తెలిపారు. బుధవారం మండలంలోని బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట 40 నుంచి 50 రోజుల దశలో ఉన్నదని, దుబ్బు చేసే దశలో సాధారణంగా ముదురు ఆకుల చివర్లు లేత పసుపు రంగుకు మారటం, పంట ఎదగక పోవటం వంటి లక్షణాలు కనిపిస్తే దానిని నత్రజని లోపంగా గుర్తించి తగిన మోతాదులో యూరియా అందించాలని ఆయన రైతులకు సూచించారు. రెండవ దఫా ఎరువులు వేసే సమయంలో సంప్రదాయ యూరియాకు బదులుగా నానో యూరియాను ఎకరాకు అర లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఆర్డీవో రామలక్ష్మి



గూడవల్లి సహకార సంఘంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

చెరుకుపల్లి: మండలంలోని రైతులు యూరియా అందదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియా అందరికి అందించటం జరుగుతుందని రేపల్లె ఆర్డీవో ఎస్.రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గూడవల్లి పీఏసీఎస్, చెరుకుపల్లి గ్రోమోర్‌లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేసి యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించి యూరియా సక్రమంగా అందుతుందా లేదా అని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ యూరియా సమృద్ధిగా సరఫరా జరుగుతుందని, మండలంలోని రైతులందరికీ అవసరం మేరకు అందించటం జరుగుతుందని, ఈ విషయాన్ని రైతులు గమనించి ఓర్పుగా వ్యవహరించాలని సూచించారు. గూడవల్లి పీఏసీఎస్‌లో 440 బస్తాలు, చెరుకుపల్లి గ్రోమోర్‌లో 440 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతులకు టోకెన్ల పద్ధతి ద్వారా నిష్పక్షపాతంగా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు గానీ మరెవరైనా యూరియా అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తిస్తే అట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువత హమీద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రైల్వే బోర్డు మెంబర్ పఠాన్ రాజేష్



అబ్దుల్ హమీద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న పఠాన్ రాజేష్

బాపట్లటౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనుడు అబ్దుల్ హమీద్ అని గుంటూరు రైల్వే బోర్డు మెంబర్ పఠాన్ రాజేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బాపట్ల ఎంపీ కార్యాలయం ఆవరణలో అమర సైనికుడు అబ్దుల్ హమీద్ 60వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ 1965లో భారత్-పాకిస్తాన్ యుద్ధంలో శత్రువులు ఆకస్మికంగా దాడి చేస్తే యుద్ధం జరిగే ప్రదేశంలో చెరుకుతోటలో దాక్కొని తన రిక్రైల్నెస్ గన్‌తో ఒక్కడే పాకిస్తాన్‌కు చెందిన 8 యుద్ధ ట్యాంకులను పేల్చివేశారన్నారు. ఆ క్రమంలో పాకిస్తాన్ తుపాకీ గుళ్లకు బలై హమీద్ మృత్యువాత పడ్డారన్నారు. దేశం కోసం హమీద్ పోరాడిన విధానాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరమ వీర చక్ర బిరుదును ప్రకటించిందన్నారు. యువత హమీద్‌ను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో కె.కొండలు, జి.కొండలు, నర్రా ఏడుకొండలు, గవిని ప్రసాద్, గేరా చార్లెస్, డి.రాము, మోహన్, నక్కా ప్రకాష్ పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు నివాళి



వేమూరు: చుండూరు మండల కేంద్రంలో దళితులపై జరిగిన దాడులను వ్యతిరేకించిన అనిల్‌కుమార్ పోలీసులు కాల్పుల్లో మృతి చెందాడని దళిత న్యాయవాది కె.సి.బసవయ్య తెలిపారు. తెనాలి గంగానమ్మపేటలో అనిల్‌కుమార్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991లో చుండూరులో దళితులపై అగ్రవర్ణాల వారు దాడులు చేశారని, ఆ దాడులను వ్యతిరేకించిన అనిల్‌కుమార్‌ను పోలీసులు కాల్చి చంపారన్నారు. చుండూరు దాడుల్లో మృతి చెందిన అనిల్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రవి రాజా, కూకటిపల్లి వినోద్‌కుమార్, సురేష్, మాణిక్యరావు, మండే పీటర్, బడుగు రత్నకుమార్, దాసరి బాబు తదిరులు పాల్గొన్నారు.